# తిరగబడిన జాతకం

ముందు గదిలో మంచంమీద పడుకుని ఖళ్లుఖళ్ళున దగ్గుతున్నాను.

చివరిపిల్ల శ్యామల మంచినీళ్ళు అందించింది.

పొలమారకుండా మంచినీళ్ళు కొద్దిగా తాగేను.

ఇంకా ఎనిమిదేళ్ళ సర్వీసుంది. కానీ-పక్షవాతం వచ్చి కుడిచేయి కాలు పడిపోయిన కారణంగా మెడికల్ అన్‌ఫిట్ చేసి కంపల్సరీ రిటైర్‌మెంట్ ఇచ్చారు.

రిటైర్‌మెంట్ ఆర్డరుతోపాటు ప్రావిడెంటుఫండూ, గ్రాట్యుటీ కలిసి పూర్తి పదిహేను వేలయినా అందలేదు.

నేను మంచాన పడ్డనాటికి పెద్దపిల్ల పెళ్ళి మాత్రం ఎలాగో అయిందనిపించ గలిగేను.

ఇద్దరు మగపిల్లలకీ చదువు అబ్బలేదు.

ఒకడు మోటారు మెకానిక్ పనిచేస్తూ నెలకో నూట యాభయి రూపాయలు తెస్తే, రెండోవాడు జులాయిగా తిర గటం తప్పించి మరెందుకూ కొరకాకుండా పోవటం నా దుర దృష్టం.

మగపిల్లలు చూడబోతే అట్లా, పెళ్ళికి ఎదిగిన శ్యామలని ఓ అయ్య చేతిలో పెట్టగల శక్తి లేక నిత్యమూ సన్ను దిగులు పీక్కు తింటోంది మరో వేపు.

గత రెండేళ్ళుగా నా మందుల ఖర్చుకి ఇంటిలోకి సగం డబ్బు అయిపోయింది.

మిగతాది కూడా హరించిపోతే పిల్ల పెళ్ళి ఎలాచేయటం అనే ప్రశ్న మరో వేపు.

సర్వీసులో ఉండగా నెలకు చేతికి అందే అయిదువందల రూపాయల జీతం కాక.. నెలలో నాలుగు కథలు అలవోకగా వ్రాసిపారేసి మరో రెండువందలు సంపాదించుకునే వాడిని.

కాలు చెయ్యి పడిపోవటంతో ఇప్పుడు కథలు వ్రాయగల అవకాశమూ పోయింది.

మనసునిండా ఆలోచన్లే. నిజానికి ఈ పరిస్థితుల్లో కొన్ని వందల కథలు వ్రాయచ్చు, ఎన్నో కథావస్తువులు. కానీ వ్రాయాలనే ఆరాటం తప్పించి వ్రాయగలశక్తి లేకుండా చేశాడు భగవంతుడు.

"ఏమండీ ... మన పరిస్థితి చూడబోతే రోజురోజుకీ మరింత అధ్వాన్నంగా తయారవుతోంది. ఆదాయం చూద్దామా అంటే లేదు. ఖర్చులేమో మితిమీరుతున్నయ్. పోనీ ఒక పని చెయ్యకూడదూ? ఆ చెక్కబీరువానిండా అచ్చయిన నవలలూ కథలూ బోలెడన్ని వున్నయ్. అనవసరంగా వాటిని చెద తినేస్తోంది. వాటిని తీసుకెళ్ళి ఎవరికైనా ఇస్తే వాళ్ళు అచ్చేసుకుని మనకింత డబ్బిస్తారేమో అడిగి చూడకూడదూ?" కాఫీగ్లాసు అందిస్తూ శ్రీమతి సలహా ఇచ్చింది.

అదీ నిజమే! వార, మాస పత్రికల్లో అచ్చు అయిన కథలు సుమారు రెండువందల వరకూ వున్నయ్. ఓ ఇరవై నవలల్లో కొన్ని సీరియలైజ్ అయినవీ, మరికొన్ని కాని వ్రాత ప్రతులూ...

అవన్నీ ఏ పబ్లిషరైనా పుస్తకాలుగా వెలువరిస్తే ఎంత కాదన్నా ఓ పదివేలు రాయల్టీ వస్తుంది. ఇన్నాళ్ళుగా అలాంటి ఆలోచనే నాకు తట్టలేదు.

"ఎంతోకొంతకి వాటిని షాపువాళ్ళకిచ్చేయండి. ఇంటిలో పెట్టుకుని ఏం ప్రయోజనం? ఆ డబ్బు పిల్లపెళ్ళికయినా వుపయోగపడుతుంది" అంటూ నేను కాఫీతాగి అందించిన ఖాళీగ్లాసు చేతబుచ్చుకుని వంట ఇంటిలో కెళ్ళిపోయింది అర్థాంగి.

అప్పటికప్పుడే ... బీరువాలోంచి నా రచనలన్నింటినీ బయటకు తీయించి ఓ సంచిలో సర్దించి వుంచాను.

ఊళ్ళో నాలుగైదు ప్రచురణ సంస్థలున్నాయ్!- ఎవ్వరి తోనూ నాకు వ్యక్తిగతమైన పరిచయంలేదు. ఏనాడు ఏ పబ్లిషర్ని అయినా సరే. నా రచనని పుస్తక రూపంలో వెలువరించరూ అని యాచించలేదు.

ఇప్పుడు వారికాళ్ళావేళ్ళాపడి అర్థించాల్సిన అవసరం వచ్చింది.

శ్యామలని తోడు తీసుకుని రిక్షా ఎక్కేను.

ఒక లీడింగ్ పబ్లిషింగ్ హౌస్ దగ్గర రిక్షా ఆపించాను. నాతో శ్యామల రిక్షాదిగి డబ్బులిచ్చేసింది.

చేతికర్ర ఆసరాతో అడుగులో అడుగేసుకుంటూ షాపులోకి నడిచాను.

ఆ షాపులో పుస్తకాలు అమర్చిన తీరు ... అలంకరణ చూడగానే నాప్రాణం లేచివచ్చినట్టయింది.

ఎందరో రచయితల పుస్తకాలు... ఎన్నో భావల రచనలు... నాశరీరం పులకించింది వాటిని చూడగానే.

వెంటనే నా అశక్తత గుర్తొచ్చింది.

నా కళ్ళు చమర్చాయి. నా హృదయం బాధతో మూల్గింది.

"ఎవరు కావాలి సార్ మీకు? ... పుస్తకాలేమైనా కొంటారా? ..." కౌంటర్లో కుర్రాడు అడిగేడు.

"బాబు! మీప్రొప్రైటర్ గారులేరా? అడిగేను.

"లేరండి... మేనేజరు వున్నారు..." అంటూ అటు కేసి చెయ్యి చూపించాడు కౌంటర్లో కుర్రాడు.

మేనేజర్ ని సమీపించగానే 'దయచేయండి కూర్చోండి, ఏం కావాలి తమకు...' నమ్రత వుట్టిపడే ధోరణిలో అడిగేడు మేనేజర్.

"నాపేరు రాజారాం! మీప్రొప్రైటర్ గార్ని కల్సుకోవాలని వచ్చాను..."

"వారింకా షాపుకి రాలేదు. మరో పది నిముషాల్లో రావచ్చు" మరేదో పనిచూచుకుంటూ అన్నాడు మేనేజరు.

"మీకు అభ్యంతరం లేకుంటే నేను అంతవరకూ ఇక్కడ కూర్చుంటాను."

"అలాగే! అనేసి ఇంతలో టెలిఫోన్ మోగటంతో రిసీవర్ చేతిలోకి తీసుకుని మాట్లాడనారంభించేడు మేనేజర్.

నామనస్సు పరిపరి విధాలుగా ఆలోచించటం మొదలు పెట్టింది.

ఇంతలో కాఫీ తెప్పించి ఇచ్చాడు మేనేజర్.

సభ్యతకోసం "మీరు శ్రమతీసుకోకండి, ఇప్పుడే తాగి వస్తున్నాం" అన్నాను.

"మా షాపుకొచ్చిన వారిని గౌరవించటం మా సంప్రదాయం. పర్లేదు పుచ్చుకోండి" మొహమాట పెట్టాడు మేనేజర్.

కాఫీతాగేక "ఇంతకూ మీ ప్రొప్రైటర్ గారి పేరేమిటన్నారు" అడిగేను.

"రాజేంద్ర! అదిగో అగ్లాసు వేరింగ్ ఛేంబర్లో కూర్చుంటారు. అదీవారి ఆఫీసుగది'' పని చేసుకుంటూనే చెప్పేడు మేనేజర్.

అటు కేసి చూశాను. గ్లాసు డోర్లోంచి లోపల అంతా కన్పిస్తోంది. అందమైన డెకోలోమ్ టేబులు, టేబిలు మీద పుస్తకాలు, రెండు టెలిఫోన్లు అధునాతనమైన అలంకరణ చాలా రిచ్‌గా వుందా గది.

గ్లాస్ వేరింగ్ డోర్ మీదుగా ప్లాస్టిక్ బోర్డు అవుపించింది. పెద్ద అక్షరాల్లో "రాజేంద్ర-ప్రొప్రైటర్ అని వుంది.

రాజేంద్ర పేరు నాకు పరిచితమైందిగా తోచింది. నాకు తెలిసిన రాజేంద్రేనా ఇతను? ఏమో ఎందుకు కాకూడదూ?

ఒకవేళ అతనే ఇతనయితే తానొచ్చిన పని తప్పక అవుతుంది.

నా ఆలోచనలు గతంలోకి పరుగెత్తాయి.

తిథి వార నక్షత్రాలే కాదు, కనీసం ఆ సంవత్సరం కూడా ఏదో నాకు గుర్తులేదు.

పదిహేనేళ్ళ క్రితం సంగతి.

ఆంధ్ర దేశంలో నాకు రచయితగా అప్పటికే మంచి పాప్యులారిటీ వుంది.

పాతికేళ్ళ ప్రాయంలోనే మంచి కథారచయితగా పేరు ప్రఖ్యాతులు రావటం చాలామంది రైటర్ ఫ్రెండ్సుకి కంట గింపుగా వుండేది.

ఎదుటివారిలో అసూయను గమనిస్తూ గర్వపడే వాడ్ని మాత్రం కాదు.

తోటి రచయిత ఫ్రెండ్సు నాతో నవ్వుతూ మాటాడు తున్నా వారి నొసలు వెక్కిరించటం నేనెరుగుదును.

సాహితీ మిత్రులతో ప్రతి సాయంత్రం మా ఇంటి ముందు గదిలో ఏవేవో చర్చలు జరుగుతుండేవి.

సలహాలు సంప్రదింపులకోసం కొత్తగా కథ వ్రాయాలనే తపనవున్న కుర్రవాళ్ళు మాయింటికి రావటంకద్దు.

సాహితీ ప్రియులలో ఎన్నో ముచ్చట్లు మరెన్నో డిస్కషన్సు, ఎన్నో రాత్రులు పగళ్ళు ఆనందంతో నవ్యమైన స్పందతో గడిచేవి.

ఒకరోజు ముందు గదిలో కూర్చొని కథేదో వ్రాసుకుంటున్నాను.

పోస్ట్‌మేన్ పిలుపు వినిపించడంతో ఆఖరు పిల్ల శ్యామల పరుగెత్తుకుంటూ వెళ్ళి ఉత్తరాలు అందుకుని తెచ్చి నా వడిలో పడేసింది.

వచ్చిన ఉత్తరాలు చించి శ్రీమతి చదివి వినిపిస్తుంటే నేను వ్రాసుకుంటూనే ఆలకించటం నా సరదా.

ఆ వచ్చిన ఉత్తరాల్లో రెండు పత్రికలవారి నుండి కథలు ప్రచురణకు స్వీకరించినట్టు వచ్చిన ఇంటిమేషన్సు. మరో రెండు కవర్లలో లోగడ అచ్చుఅయిన కథ తాలూకూ పంపబడిన చెక్కులు. అయిదో ఉత్తరం నా బావమరిది వ్రాశాడు. మరోటి వారం వారం వీక్లీలో వస్తున్న నా సీరియల్ మెచ్చు కుంటూ నా ఆప్తమిత్రుడు వ్రాసింది.

చివరగా చేతిలో వున్న ఉత్తరాన్ని చదవకుండానే ఇది మీరు చదువుకోండి ... నాకు అవతల వంటింట్లో బోలెడు పనుంది ... అంటూ నాకు అందించి కిచన్లోకి తుర్రుమంది శ్రీమతి.

సిగరెట్ వెలిగించి, చించిన కవర్లోంచి వుత్తరాన్ని బైటికితీసి చదవనారంభించాను.

'సాహితీ మిత్రులు రాజారాం గార్కి,

నమస్సులు! నన్ను మీరు మర్చిపోయి వుంటారు- అయినా మనం కల్సుకున్నది సంవత్సరం క్రితం! నాతో మీ పరిచయం కొద్దిగంటలు మాత్రమే!

అయినా మీరు నాకు బాగా గుర్తున్నారు. రచయితల మహాసభలో మనం కల్సుకున్నాం. ఆసభల్లో రచన - సాంఘిక ప్రయోజనం - రచయిత బాధ్యత గురించి మీరు మాట్లాడేరు. నేను మీ ఉపన్యాసంవిని మంత్ర ముగ్ధుడినే అయ్యాను. మీరు స్టేజి దిగగానే మిమ్మల్ని కల్సుకున్నాను. నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

మీ హృదయం ఆప్యాయత నన్ను కదిలించింది.

మన కలయిక కొన్ని గంటలే అయినా మీరు నిత్యమూ గుర్తొస్తూనే వున్నారు.

ఈ సుదీర్ఘమైన ఉత్తరము మీకు వ్రాయవలసి వచ్చి నందుకు దయతో క్షమించగలరు. నన్నూ నా పరిస్థితిని అర్థం చేసుకుని సాయపడవలసిందిగా కోరుకుంటున్నాను.

నేను ఒంటరిని. నాకంటూ ఎవరూ ఈ ప్రపంచంలో లేరు. బి. ఏ. పాసయి నేను ఓ గుమాస్తా ఉద్యోగంలో చేరాను. నాకు క్షయవ్యాధి వుందనే విషయం నేను శానిటోరియంలో చేరేవరకు నాకు తెలియదు. వ్యాధి ముదిరిపోయింది. నన్ను ఉద్యోగంలోంచి తీసేశారు.

చావంటే నాకు భయం లేదు, అయితే బ్రతికి ఏదో బావుకుందామనే ఆశా లేదు. చావురాకే బ్రతికివున్నాను.

బెడ్లో వుండే ఒకటి రెండు కథలు వ్రాశాను. వాటి తాలూకు వచ్చిన ప్రతిఫలంతో రోజులు గడిచినయ్.

రానురానూ వ్రాయగల ఓపిక సన్నగిల్లుతోంది. బహుశ మృత్యువు ముంచుకొస్తున్న దేమో!

నా ప్రార్థనల్లా ఒక్కటే.

మీరుగా నాకు సహాయపడక పోవచ్చు. కానీ నా ఆవేదననీ, ఆర్థికపరమైన ఇబ్బందినీ, అవసరాన్ని అర్థం చేసుకుని మీకు తోచిన రీతిలో సాయపడవలసిందిగా కోరుచున్నాను.

నన్ను మీరు బ్రతికిస్తే ఏనాటికైనా మీ ఋణం తీర్చుకోలేక పోను.

మీరు అందించనున్న అమృతహస్తంకొరకు ఆశతో నిరీక్షిస్తుంటాను.

శలవ్

భవదీయుడు

రాజేంద్ర.

వార్డు నెంబరు-7 బెడ్ నెంబరు-7

టి. బి. శానిటోరియం, మదనపల్లి.

ఆ వుత్తరం ఆసాంతం చదివేక నా కళ్ళు చెమర్చాయి. ఊహించలేని బాధేదో నాగుండెలో ముల్లులా గుచ్చుకుంది.

రాజేంద్ర వ్రాసిన కథలుచదివాను. సంఖ్య తక్కువే అయినా పది కాలాలపాటు గుర్తుంచుకోతగ్గ కథలే వ్రాశాడు.

అలాంటి వాడికి చిన్న వయస్సులో మహా మారిలాంటి క్షయవ్యాధేమిటి అన్పించింది.

ఆపూట నాకు భోజనం చేయాలన్పించలేదు.

బరువుగా నిట్టూర్చేను.

ఇప్పుడేం చేయాలి? ఏంచేస్తే అతనికి సహాయం అందించగల వాడి నవుతాను?

వెంటనే డ్రస్సు మార్చుకుని రోడ్డుమీదకొచ్చాను.

నాకు ముఖ్యులైన నలుగురయిదుగురు రచయిత మిత్రులతో ఈవిషయం చెప్పాను. చర్చించాను.

నానిర్ణయానికి మిత్రులు యస్సన్నారు.

నా ఫ్రెండ్సు సర్కిల్లో అందరూ రచయితలే! అంతా నటులే.

నేను వ్రాసిన నాటకాన్ని పదిహేను రోజులలో రిహార్సల్సు వేసి తయారయ్యాం.

నేను ఏ విధంగా రాజేంద్రకి సహాయపడుతున్నదీ ముందుగా తెలీపర్చ దలుచుకోలేదు.

అంటే నా శక్తి సామర్థ్యాలమీద నాకు నమ్మకం లేక కాదు. క్రియచేసి చూపాలన్నదే నా నిర్ణయం.

నాటక ప్రదర్శన స్థాయి మాకెలా వున్నా రచయితలం కలిసి నాటకం ప్రదర్శిస్తున్నాం అనగానే చాలా టిక్కెట్లు అమ్ముడయి, డబ్బు వసూలయింది.

మొత్తానికి రెండు వేల రూపాయలు బెనిఫిట్ షో ప్రోగ్రాం ద్వారా వసూలు చేయ గలిగేను.

ఆ మరునాడే డబ్బుతో రాజేంద్రని స్వయంగా చూడాలనే ఉద్దేశంతో బయల్దేరాను.

*　　　*　　　*

వార్డు వెతుక్కుంటూ బెడ్ నంబర్ చూచుకొంటూ నడుస్తున్న నా కాళ్ళు ఏడో నెంబరు కనిపించగానే ఆగిపోయాయి.

నా కళ్ళని నేనే నమ్మలేక పోతున్నాను.

ఓ అయిదు నిమిషాలు నా నోటివెంట మాటలేదు. కంటిలో నీరు తొణికిసలాడింది.

మనిషి ఆకారంలో దర్భపుల్లలా బెడ్ మీద ఓ వ్యక్తి కళ్ళలో ప్రాణాలు పెట్టుకు కనిపించాడు.

నన్ను గుర్తించినట్టున్నాడు. "నమస్తే సార్" అన్నాడు బెడ్ మీద నుండి లేవబోతూ.

లేవలేని అతని అవస్థ గమనించి "పడుకో పడుకో" అన్నాను పక్కనే వున్న స్టూలుమీద కూచుంటూ.

ఇంతలో నర్సు బెడ్ దగ్గరగా వచ్చి, "మీరేనా రాజారాంగారు, రాజేంద్రగారు నాతో మీకు ఉత్తరం రాయించారు. మీరొచ్చేశారు. ఇక భయం లేదు" అంది సంబరపడిపోతూ.

పరిస్థితి ఇంతహృదయవిదారకంగా వుంటుందనుకోలేదు నేను. ‘‘ఆల్ రైట్. నేనొచ్చేశాను. అయితే రాజేంద్రని సంపూర్ణ మయిన ఆరోగ్యవంతునిగా చేసి నాకు అప్పగించాల్సిన బాధ్యత మీది’’ నర్సు ముఖంలోకి చూస్తూ అన్నాను.

రాజేంద్రతో ఓ అరగంట ముచ్చటించాక శానిటోరియం సూపరింటెండెంట్ని కలుసుకుని మాట్లాడేను. ఎలాగయినా రాజేంద్రని బ్రతికించమని ప్రాధేయపడ్డాను. నావెంట తెచ్చిన డబ్బులో అయిదువందలు ఎడ్వాన్సుకట్టి రసీదు తీసుకున్నాను.

మిగతా డబ్బు రాజేంద్రకిచ్చి ధైర్యం చెప్పాను.

అదే నర్సు మళ్లీ నైట్ డ్యూటీలో కనిపించింది.

‘‘చూడండి సిస్టర్! రాజేంద్ర నాకు ఆప్తులు, పైగా మంచి రచయిత! ఇతనిలాంటి రచయితలు సమాజానికి ఎంతో అవసరం. ఇలాంటి వ్యక్తులు మనకు దూరం కాకూడదు. హాస్పిటల్లో ఐదువందలు డిపాజిట్ చేశాను. ఇక రాజేంద్ర పూర్తి బాధ్యత మీదే. దయచేసి కొంచెం స్పెషల్ కేర్ తీసుకోండి. నాకు అప్పుడప్పుడు వుత్తరాలు రాస్తూ వుండండి.

‘డోన్ట్ వర్రీ! హి విల్ బి ఆల్ రైట్. మీరొచ్చిన క్షణంనుంచీ వీరిలో కొంత కాన్ఫిడెన్సు తొంగిచూస్తోంది. అప్పుడప్పుడు మీరొచ్చి పోతూ వుంటే...ఇతని కండిషన్ క్విక్ గా ఇంప్రూ అవుతుంది’ రాజేంద్రకి ఇంజక్షన్ ఇచ్చేసి అంది నర్సు.

తలగడ క్రింద నున్న డబ్బు తీసి నర్సుకి అందించాడు రాజేంద్ర.

'బైదిబై ... ఇంత డబ్బు పేషెంట్ దగ్గర వుండటం మంచిది కాదు. మీదగ్గరే వుంచి అవసరాలకి వాడండి' అంటుండగానే నవ్వేసి వెళ్ళిపోయింది నర్సు.

ఆ రాత్రంతా రాజేంద్రతో ఏవేవో కబుర్లు చెప్పి అతనికి ధైర్యాన్ని నూరిపోశాను.

తెల్లవారింది.

రాజేంద్ర దగ్గర శలవుతీసుకుని తిరుగు ప్రయాణమయ్యాను.

*　　　*　　　*

రాజేంద్ర దగ్గర్నుంచి తరచు ఉత్తరాలు వస్తూనే వున్నయ్.

ఆరు నెలలు తిరిగే సరికి హెల్తుకండిషన్ బాగా ఇంప్రూవ్ అయినట్టు రాజేంద్ర దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం చూచి మురిసిపోయాను.

మరో నెల తిరిగే సరికి రాజేంద్ర దగ్గర్నుంచి చిత్రమైన ఉత్తరం వచ్చింది.

తనను కంటికి రెప్పలా కాపాడి అహర్నిశలు సేవలు చేసి తనను బ్రతికించిన నర్సు మేరిని పెళ్ళి చేసుకోబోతున్నట్టు వ్రాశాడు.

అందుకు తృప్తిగా నవ్వుకున్నాను.

ఇన్విటేషన్ పంపేడు రాజేంద్ర. కానీ ఆఫీసు పన్ల వత్తిడి వల్ల వెళ్ళలేక గ్రీటింగ్ టెలిగ్రాం పంపాను.

*　　　*　　　*

వసంతాలు దొర్లిపోతున్నాయ్. ఏళ్ళు గడుస్తున్నయ్...

మళ్ళీ రాజేంద్రని కలుసుకోవడమే జరగలేదు.

"సార్...ఏమిటాలోచిస్తున్నారు? ప్రొప్రైటర్ గారు ఇప్పుడే లోపలికెళ్ళారు. మీరు వెళ్ళి కల్సుకోండి." అని మేనేజరు అనటంతో గతంలోంచి ప్రస్తుతంలోకొచ్చాను.

కూర్చున్న కుర్చీలోంచి శ్యామల సహాయంతో లేచినిల్చున్నాను.

బోయ్ డోర్ తెరిచి పట్టుకున్నాడు.

నేను నెమ్మదిగా గదిలోకి అడుగుపెట్టేను.

కుర్చీలో కూర్చున్నాను.

ప్రొప్రైటర్ పేపరు ముఖానికి అడ్డంపెట్టుకుని చదువుతున్న వాడల్లా ముందుకు వంగి 'ఏం కావాలి మీకు?' అడిగేడు.

పరీక్షగా అతని ముఖంలోకే చూశాను.

అవును. నేను వూహించినదే నిజమైంది. ఒకనాటి కథారచయిత, తన మిత్రుడు అయిన రాజేంద్ర ఇతను. సందేహంలేదు.

అయితే తను చూసిన రాజేంద్రకీ ఇప్పుడు చూస్తున్న రాజేంద్రకీ ఎంతో వ్యత్యాసం వుంది.

ఇప్పుడు సంపూర్ణమైన ఆరోగ్యంతో ఫుల్ సూట్‌లో హుందాగా గొప్పగా లావిష్‌గా వున్నాడు.

'నన్ను గుర్తించినట్టులేదు' చిన్నగా అడిగేను.

విలాసంగా లైటర్‌తో సిగరెట్ వెలిగించి కులాసాగా కాల్చుతూ 'ఆఁ! అవును మీరు ఏమీన్ రాజారాంగారు

కదూ? గుర్తొచ్చారు. మీరు ఇలా అయిపోయారేమిటి'
అన్నాడు ఏదో పుస్తకంమీద దృష్టి లగ్నంచేస్తూ.

అతని మాటల్లో ఆప్యాయత తొంగిచూడక పోవటం నేను గ్రహించాను. ఏదో కలుసుకున్నాను కాబట్టి ... గతం గుర్తొచ్చింది కాబట్టి అలా అన్నాడు. అంతే అన్పించింది.

అయినా అవసరం నాది. అర్థించటం యాచించటం తప్పదు అనే నిర్ణయానికొచ్చాను.

'నేను ప్రస్తుతం చాలా ఇబ్బందులలో ఉన్నాను. జాబ్ లేదు. పైగా పెరాలిసిస్‌తో సఫరౌతున్నాను. పరిస్థితి చూస్తున్నారుగా! నా రచనలు పుస్తక రూపంలో అచ్చేసి హెల్ప్ చేయండి. ఐంవాట్ ఒన్లీ దట్! దట్సాల్! ప్లీజ్ పిటీ మై కండిషన్ అండ్ హెల్ప్‌మీ' అన్నాను కళ్ళు తుడుచుకుంటూ.

ఒక్క క్షణం దీర్ఘంగా ఆలోచించాడు.

రివాల్వింగ్ ఛైరులో అటూ ఇటూ విలాసంగా కాళ్ళు వూపేడు రాజేంద్ర.

చేతిలో సిగరెట్ యాష్‌ట్రేలో వుంచుతూ "సారీ సార్! ప్రస్తుతం బిజినెస్ చాలా డల్‌గావుంది. ఇప్పుడు మార్కెట్‌లో వున్న రచయితల పుస్తకాలే అచ్చు వేయకుండా వున్నాం. ఎప్పుడో అచ్చుఅయిన రచనలు అచ్చు వేయాలంటే అందులో చాలా రిస్కువుంది. అవి మార్కెట్ కావు. బట్ ఐ కెన్ హెల్ప్ యు దిస్ మచ్" జేబులోంచి రెండు వందల రూపాయల నోట్లుతీసి అందించబోయాడు.

అవమానంతో కుంచించుకు పోయాను. నన్ను నేను నిందించుకున్నాను. నా పరిస్థితికి నామీద నాకే అసహ్యం వేసింది.

బండ్లు ఓడలు ఓడలు బండ్లు కావటం అంటే ఇదే కాబోలు అనుకున్నాను.

అక్కడ ఒక్కక్షణంకూడా వుండాలనిపించలేదు.

కూర్చున్న వాడినల్లా మెల్లగా బయటకు దారి తీసాను.

— ( సౌమ్య మాసపత్రికలో ప్రచురితము )

★

*With the best compliments*

*from*

**Balaji Vihar Lodging**

*( By the side of the BANK OF INDIA )*

*WITH*

**CONVENIENT AND COMFORTABLE ROOMS**

**( with attached Bath Rooms )**

**CHITTOOR.** **Phone : 2312**